క్లుప్తంగా

రాట్నాలమ్మకు విశేషాలంకరణ



పెదవేగి: రాట్నాలకుంటలో వేంచేసి యున్న రాట్నాలమ్మ వారి దేవస్థానానికి ఆదివారం రూ.1,47,656 ఆదాయం వచ్చిందని కార్యనిర్వాహణాధికారి నల్లూరి సతీష్ కుమార్ తెలిపారు. పూజా రుసుముల ద్వారా రూ. 23,280, విరాళాలు రూ.1,05,831, లడ్డూ ప్రసాదం విక్రయాలతో రూ. 15,975, ఫొటోల అమ్మకం ద్వారా రూ. 2578 మొత్తం రూ. 1,47,656 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు.

రాట్నాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

దెందులూరు: రాట్నాలమ్మ ఆలయ అభివృద్ధికి కోనసీమ జిల్లా గుమ్మిలేరు వాసి ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణవేణి దంపతులు ఆదివారం ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సమక్షంలో అమ్మవారి సన్నిధిలో రూ. లక్ష విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ కార్యనిర్వాహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్, ఎమ్మెల్యే చింతమనేని అభినందించారు.

రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించాలి



దెందులూరు- అప్పారావుపాలెం మధ్య ఉన్న రైల్వే గేటు

దెందులూరు: దెందులూరు- అప్పారావుపాలెం మధ్య ఉన్న రైల్వేగేటు వద్ద వేలాది మంది భక్తులు, ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ద్వారకాతిరుమలకు ఏలూరు నుంచి దెందులూరు, అప్పారావుపాలెం తదితర ప్రాంతాల్లోని భక్తులు రావడానికి దెందులూరు మీదుగా ప్రయాణిస్తే దూరం తక్కువ కావడంతో సమయం కలిసి వస్తుంది. భీమడోలు మీదుగా ద్వారకాతిరుమల వెళ్లాలంటే సమయం, దూరం రెండూ ఎక్కువ. దెందులూరు రైల్వేగేటు 15 నిమిషాలకు ఒకసారి వేయడంతో ఈ గేటు మీదుగా వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.


మేధా దక్షిణామూర్తికి వెండి తొడుగు అలంకరణ



మేధా దక్షిణామూర్తి ఆలయ పూజారులకు వెండి తొడుగును అందజేస్తున్న దాతలు

దెందులూరు: చినకాశీగా పేరొందిన చల్లచింతలపూడి మేధా దక్షిణామూర్తికి దాత దామరాజు రామంమూర్తి, పసుమర్తి శ్రీలక్ష్మి కృష్ణప్రసాద్ రూ. 1.50 లక్షల విలువ చేసే కేజీన్నర వెండి తొడుగును ఆలయ అర్చకులు ప్రసాద్‌కు ఆదివారం అందజేశారు. ఆలయ అర్చకుల సమక్షంలో దాతలు ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి వెండి తొడుగులను స్వామివారికి అలంకరించారు.

వైద్య విద్యార్థుల రక్తదానం



సెయింట్ జోసెఫ్ దంత వైద్యకళాశాలలో రక్తదానం చేస్తున్న దంత వైద్య విద్యార్థులు

దెందులూరు: రక్తదాతలు ప్రాణదాతలని వారి త్యాగం, సేవాభావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని సెయింట్‌జోసెఫ్ డెంటల్ వైద్య కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జీ.మోజెస్ అన్నారు. ఆదివారం దంతవైద్యకళాశాలలో రక్తదాన శిబిరం జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. 50 మంది దంతవైద్యవిద్యార్థులు రక్తదానం చేశారు. వారిని కృష్ణారెడ్డి అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎన్. సీల్వరాజు మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తమార్పిడి చికిత్స పొందుతున్న తలసేమియా చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్.ఫిలిక్స్, ప్రిన్సిపల్ డాక్టర్ సీల్విరాజ్, డాక్టర్ భావన సంధ్య, డాక్టర్ స్పందన, పీఆర్‌ఓ పీవీ రమణ ఉన్నారు.

గుర్రపు డెక్క తొలగింపు

ఏలూరు రూరల్: వరదనీరు పారేందుకు ఆదివారం అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు. ఇందు కోసం ప్రొక్లెయిన్ ఉపయోగించారు. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదనీరు ఏలూరు తూర్పు, పడమట లాకుల మీదుగా కొల్లేరులోకి ప్రవహిస్తోంది. ఇదే సమయంలో వరదనీరు, గుర్రపు డెక్క ఏలూరులో పలు వంతెనల వద్ద పిల్లర్లకు అడ్డుపడి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. దీన్ని గుర్తించిన అధికారులు ఏలూరులో పడమట, తూర్పు లాకుల వద్ద వంతెనపై నుంచి ప్రొక్లెయిన్‌తో గుర్రపు డెక్క తొలగిస్తున్నారు. ఫలితంగా వరద ప్రవాహం వేగం పుంజుకుంటోంది.

ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు రైతుల మొర
- ముంపు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటన
- యనమదుర్రు మురుగుకాలువ ఉగ్రరూపం



తహసీల్దార్ జితేంద్రకు సమస్యలు విన్నవిస్తున్న రైతులు



జల్లికొమ్మరలో చెరువులను తలపిస్తున్న వరిచేలు



కోమర్రులో నీట మునిగిన వరి దుబ్బుని ఎమ్మెల్యే ధర్మరాజుకు చూపుతున్న రైతు



కొమ్మరలో కుళ్లిన వరి దుబ్బులను అధికారులకు చూపుతున్న రైతు

దెందులూరు: ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు మొర పెట్టుకున్నారు. చల్లచింతలపూడిలో ఆయిల్‌పామ్, కొబ్బరి, వరి, మొక్కజొన్న, ఇతర పంటలకు చెందిన 48 ఎకరాలు రైతులకు ప్రత్యామ్నాయం లేకుండా వర్షాలకు ముంపునకు గురవుతున్నాయని చల్లచింతలపూడి 48 ఎకరాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం చల్లచింతలపూడి ముంపునకు గురైన పంటలను తహసీల్దార్ జితేంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు వేమన రాము, ముమ్మడి మోహనరావు, వెంకట్రాజు, నాగనబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ 48 ఎకరాలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే పొలాల నుంచి పోలవరం కాలువకు తూరలు వేయడం బోదెలు ద్వారా దిగువ ప్రాంతాలకు వర్షపు నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, ఈ రెండు చర్యల్లో ఏ పనిచేసినా 48 ఎకరాల రైతులు వారి తరపున ఉన్న కుటుంబ సభ్యులు శాశ్వతంగా రక్షణ పొందుతారన్నారు. వెంటనే తహసీల్దార్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లి, సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ, ఇరిగేషన్ డీఈ, ఏఈలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. మిగిలిన రైతులు, వీఆర్వో కృష్ణకుమారి, పంచాయతీ బిల్లు కలెక్టర్ గణపతి ఉన్నారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వేడుకోలు

గణపవరం: భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకుంటామని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పర, మొయ్యేరు, కోమర్రు, డి.కుముదవల్లి, ముప్పర్తిపాడు, కేశవరంలో నీటమునిగిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. పలుచోట్ల రైతులు నీట మునిగి కుళ్లిపోతున్న వరి దుబ్బులను ఎమ్మెల్యేకు చూపించి, తమను ఆదుకోవాలని వేడుకున్నారు. బాధిత కుటుంబాలకు కూరగాయలు, నిత్యావసర సరకులు అందజేశారు. పిప్పరలోని యనమదుర్రు మురుగుకాలువ ఉద్ధృతిని పరిశీలించారు.

బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న ముంపు ప్రాంత ప్రజలు

కాలువకు గండ్లుపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ఇసుక,మట్టి బస్తాలతో గట్లు ఎత్తుపెంచారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేసి, అవసరమైతే పునరావాస శిబిరాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ వై.రాంబాబు తెలిపారు. ఆదివారం వరదనీరు పోటెత్తడంతో యనమదుర్రు మురుగుకాలువ ఉగ్రరూపం దాల్చింది. గట్ల సరాసరి ప్రవహించడంతో పరీవాహక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. ఇప్పటికే యనమదుర్రును ఆనుకుని ఉన్న పిప్పర, మొయ్యేరు, కోమర్రు, డికుముదవల్లి, కేశవరం, కొండేపాడులోని వరిచేలలోకి వరదనీరు ప్రవేశించింది. కొండేపాడు వద్ద బ్రిటిష్ కాలం నాటి లోలెవల్ వంతెన పూర్తిగా మునిగిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో సార్వా నాట్లు పూర్తయిన నాలుగు వేల ఎకరాల్లోని మొత్తం పైరు ముంపులో నాలుగు రోజులుగా ముంపులోనే ఉంది. ఆదివారం కాస్త తెరిపి ఇచ్చి వర్షం ఆగడంతో రైతులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. రెండు మూడు రోజుల్లో ముంపునీరు బయటకుపోతే వరి దుబ్బులకు పెద్దగా నష్టం ఉండదని, సస్యరక్షణ చర్యలతో నష్టాన్ని తగ్గించుకునే అవకాశం ఉందని చెబుతునారు.

కాలువల గట్లను పటిష్ట పర్చాలి

ఉంగుటూరు: ముంపు ప్రాంతాలను ఆదివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. ఉంగుటూరు, రావులపర్రు, నాచుగుంట, కైకరంలో ఆయన ముంపు బారిన పడిన పంట పొలాలను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వరద నష్టాలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని తెలిపారు. బలహీనంగా ఉన్న కాలువల గట్లను పటిష్ట పర్చాలని రైతులు కోరారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికార్లు పాల్గొన్నారు.

డ్రెయిన్ల ఆక్రమణతో ముంపు సమస్య

భీమడోలు: కాలువల్లో, డ్రెయిన్లు, బోదెల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో ముంపు నీరు కిందకు వెళ్లే మార్గం లేక పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని, నాట్లు కుళ్లిపోయాయని, దీని వల్ల వేలాది రూపాయలు నష్టపోయామని రైతులు వాపోయారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం, సాయన్నపాలెం, పెదలింగంపాడు ప్రాంతాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంట చేలను ఆదివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆక్వా రైతులు తమ చుట్టూ ఉన్న డ్రెయిన్లను ఆక్రమించుకోవడం వల్ల నీరు కిందికి ప్రవహించక పంట పొలాలు ముంపుబారిన పడుతున్నాయని రైతులు వాపోయారు. వెంటనే గుర్రపు డెక్కలను తొలగించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీపీ ఉషారాణి, సర్పంచ్ దాయం సుజాత, తహసీల్దార్ జి.వరహాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కీటకాల ఉధృతి.. అల్లాడుతున్న పశువులు

- పగలు ఈగలు, రాత్రి దోమల హింస
- పాడి రంగంపై తీవ్ర ప్రభావం
- నష్టపోతున్న రైతులు
- పశువులకు, ప్రజలకు కంటిపై కునుకు కరువు



ఈగల ధాటికి మేత మేయకుండా పరుగు తీస్తున్న పశువులు

పెదవేగి : దోమలు, నల్లులు రాత్రి బాధిస్తాయని, ఈగలు, కీటకాలు పగలు బాధిస్తాయని ఓ అవధాని అన్న మాటలు అక్షర సత్యమని పాడి రైతులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచి ఆర్థిక భరోసా కల్పించే వాటిలో పాడి రంగం చాలా ప్రధానమైంది. సర్వకాలాల్లో ఆర్థికంగా రైతు కుటుంబానికి ఈ రంగమే అండగా ఉంటుంది. అటువంటి రంగం నేడు ఈగలు, దోమల ఉధృతి కారణంగా కుదేలవుతోంది.

వర్షాలకు పెరిగిన కీటకాల ఉధృతి

పగటి వేళల్లో ఈగలు, రాత్రి సమయంలో దోమలు వెరసి పశువులకు నరకం చూపిస్తున్నాయి. వీటి దెబ్బకు గ్రామీణ ప్రాంతంలో పాడిరంగం కుదేలవుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీగా ఉన్న పంట భూముల్లో పచ్చిక మొలకెత్తడంతో పశువులకు గ్రాసం దొరికిందన్న సంతోషం రైతుల్లో నెలకొంది. తీరా చూస్తే పొలాల్లో ఈగలు, కీటకాలు విపరీతంగా పెరిగిపోవడంతో పశువులు గ్రాసం తినడం సంగతి దేవుడెరుగు పొలాల వెంబడి పరుగులు తీస్తూ రైతులను నానా ఇబ్బందుల పాల్జేస్తున్నాయి,. దీనికి తోడు వర్షాల కారణంగా గ్రామాల్లో దోమలు పెరిగిపోయాయి. వీటి తాకిడి పశువులతో పాటు ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. ఈ రెండింటి ప్రభావం పాల దిగుబడిపై పడుతోందని రైతులు వాపోతున్నారు.

ఈగల ధాటికి విలవిల

నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో పగటి పూట ఈగలు (చిట్టీగ) పొలాల్లో గుంపులుగా తిరుగుతూ పశువులపై దాడి చేస్తున్నాయి. వాటి ధాటికి మేత కోసం వెళ్లిన పశువులు ఒక చోట నిలబడలేక మేత తినలేని పరుగులు తీస్తున్నాయి.దీంతో పశువులను పట్టుకునేందుకు పాడి రైతులు ఆపసోపాలు పడుతున్నారు.

బాబోయ్ దోమలు

పగలంతా ఈగలతో బాధపడుతున్న పశువులు రాత్రి అయ్యిందంటే దోమలతో బెంబేలెత్తిపోతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటి తీవ్రతకు పశువులతో పాటు మనుషులు హడలిపోతున్నారు. దోమల బాధ పడలేక కొందరు పాడి రైతులు తమ పశువులకు రక్షణగా దోమ తెరలను ఉపయోగిస్తూ గడ్డిని కాల్చి పొగబెడుతున్నారు.

తగ్గిపోతున్న పాల దిగుబడి

ఈగ, దోమకాటు వల్ల పశువులు తిండి తగ్గించడంతో క్షీణిస్తున్నాయని దీంతో పాల దిగుబడి తగ్గిందని పాడి రైతులు వాపోతున్నారు. రెండు లీటర్లు పాలిచ్చే పశువు కనీసం లీటరు కూడా ఇవ్వడం లేదని వారన్నారు. దీంతో ఆర్థికంగా నష్టపోతున్నామని పాడి రైతులు అంటున్నారు.

చర్యలు శూన్యం

వర్షాకాలంలో దోమల, కీటకాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు ఎక్కడా వాటిపై దృష్టి సారించిన దాఖలాల్లేవు. గ్రామాల్లో ప్రజలు, పశువులు దోమల వృద్ధి కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీటివల్ల పలు రకాల అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. అందుకే ముందస్తు చర్యల్లో భాగంగా అధికారులు దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నరకప్రాయంగా ఉంది



పగలు ఈగలు, రాత్రి దోమలతో ఇటు మనుషులకే కాక పశువులకు తీవ్ర నకరప్రాయంగా మారింది. పాల దిగుబడి తగ్గిపోయింది. పగలంతా ఎంతో కష్టపడి ఇళ్లకు చేరుకునే మాకు రాత్రి దోమల దాడితో నిద్ర పట్టక ఉదయం పనికి వెళ్లలేకపోతున్నాం. పంచాయతీలు ఈగలు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– ముస్సి శ్రీను, వేగివాడ

వరద బాధిత రైతులను ఆదుకోవాలి



ఎంఎంపురంలో ముంపు బారిన వరి చేలను పరిశీలిస్తున్న రైతు సంఘ నాయకులు

భీమడోలు: అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని జిల్లా సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.లింగరాజు డిమాండ్ చేశారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురంలో ముంపుబారిన పంట చేలను ఆదివారం సీపీఎం ప్రతినిదులు, రైతు సంఘం నాయకుల బృందం పరిశీలించింది. వాలుకోడు, పుప్పాల వారి కోడు, తుమ్మకోడు వంటి పంట బోదెలను పూడిక తీయకపోవడంతో గుర్రపుడెక్కతో పూడుకుపోయాయని, దీనితో పొలాలన్నీ ముంపునకు గురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వాటిపై కలుపు మందు చల్లి తొలగించే వారన్నారు. కొన్నేళ్లుగా ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టకపోవడంతో బోదెలన్నీ తూడుతో నిండిపోయాయన్నారు. వాటిని తక్షణమే యంత్రాల సాయంతో పూడిక తీయించాలని డిమాండ్ చేశారు. రైతులు ఇప్పటికే ఎకరాకు రూ.12వేల ఖర్చు చేశారని, వర్షాలకు పైరు నీటి పాలయ్యిందని, మరో రూ.10వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులు, కౌలు రైతులను ఆదుకోవాలన్నారు. పంట దెబ్బతిన్న రైతాంగానికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా భాస్కరరావు, కొర్ని అప్పారావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, పెద్దిరెడ్డి సురేష్, పెద్దిరెడ్డి ఏసుబాబు, కిలారు వెంకట్రావు పాల్గొన్నారు.

బాధ్యతారహితంగా హోం మంత్రి వ్యాఖ్యలు

దెందులూరు: పల్నాడు జిల్లాలో రాజకీయ దాడిలో మృతి చెందిన రషీద్ హత్యను ఖండిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడాన్ని ఖండిస్తే దాన్ని వక్రీకరించిన రాష్ట్ర హోం మంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే చాలా విడ్డూరంగా ఉన్నాయని రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ అన్నారు. హోంమంత్రి బాధ్యతారాహిత్యంగా మాట్లాడి ఆ పదవికి మచ్చ తెచ్చారని ఆయన ఆదివారం విమర్శించారు. హోం మంత్రి వ్యాఖ్యలు ఆమె అవగాహన రాహిత్యాన్ని బహిర్గతం చేశాయన్నారు.ప్రజల మాన ప్రాణాలకు విలువకుండా ఆమె మాట్లాడటం శోచనీయమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ అరాచకాలకు ఆజ్యం పోస్తూ రాష్ట్రాన్ని మరో బీహార్ చేస్తున్నారని ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు, రాజకీయ హత్యలు, దాడులపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించకపోవడం దారుణమని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు శాంతిభద్రతలపై దృష్టి సారించకుండా ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు ఉసిగొల్పుతున్నారని అన్నారు.ప్రభుత్వ మెడలు వంచడానికి ప్రజలు తగిన సమయం కోసం ఎదురు చూస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా రాష్ట్రంలో రాష్ట్రపతి పరిపాలన విధించాలని కోరటం న్యాయ సమ్మతమని పల్లెం ప్రసాద్ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై రాష్ట్రపతి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మూడు నెలల రేషన్ ఇవ్వాలి

దెందులూరు: గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు, కూలీలు అన్ని రకాల చేతివృత్తిదారులు, వ్యాపారులు, బడుగు, బలహీన వర్గాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఏపీ మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెళ్ళ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కరోనా సమయంలో నగదు రూపేణా ఆర్థిక సాయం, రేషన్ ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. మానవతా దృక్పథంతో రాష్ట్రంలోని వరద బాధితులందరికీ ప్రభుత్వం మూడు నెలల రేషన్‌ను సరఫరా చేయాలని కోరారు. మరో మూడు రోజులు పాటు వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వం పేదల అందరికీ రేషన్ త్వరితగతిన పంపిణీ చేయాలని మురళీకృష్ణ కోరారు.

చెస్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ

ఏలూరు రూరల్: అంతర్జాతీయ చెస్ దినోత్సవ సందర్భంగా ఏలూరులో నిర్వహించిన చెస్ పోటీల్లో బాలబాలికలు సత్తా చాటారని చెస్ అకాడమీ డైరక్టర్ జి.యోహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సిద్ధార్థ విద్యాలయంలో నిర్వహించిన ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారని వివరించారు. విద్యార్థుల్లో చెస్ పట్ల ఆసక్తి పెంచి వారిలో నైపుణ్యం వృద్ధి చేసేందుకు పోటీలు చేపట్టామన్నారు. అండర్-7, 9, 11, 13 వయస్సు విభాగాలకు పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించామన్నారు. జి.అభిషేక్ అవ్రహామ్ ప్రథమ స్థానం, జి.అనురూప్ మోషే ద్వితీయ స్థానం, పి.ఉదయ్‌కుమార్ తృతీయ స్థానం సాధించారని, బాలుర అండర్-7 విభాగంలో ఎస్.స్టీఫెన్, అండర్-9లో బెన్ని, అండర్ 11, 13 ఆశిష్, ఎన్.శ్రేయస్ విజయం సాధించారన్నారు. బాలికల విభాగంలో టి.మీనాక్షి, నిత్యశ్రీ, ఎస్.హాసిని పలు విభాగాల్లో విజయం సాధించారన్నారు. న్యాయవాది ఎన్.కాత్యాయిని చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు.

సమాజంలో గురువు స్థానం మహోన్నతం



గురుపూజోత్సవంలో పూజలు చేస్తున్న భక్తులు



శాకంబరి అలంకరణలో సాయిబాబా

గణపవరం: సమాజంలో గురువు స్థానం మహోన్నతమైనదని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతి గౌరా కృష్ణ అన్నారు. ఆదివారం గణపవరం మండలం వాకపల్లిలో నందూరి గాంధీ ఇంటి వద్ద నిర్వహిస్తున్న శ్రీ యతీంద్ర నవరాత్రుల గురుపూజ మహోత్సవంలో ఆయన పాల్గొని ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. తొలుత కృష్ణా జిల్లా పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమ పీఠాధిపతులు సీతారామ యతీంద్ర గురుదేవులు, లక్ష్మణ యతేంద్ర గురువులు, సీతారామ గురుదేవుల చిత్రపటాలకు పాదపూజలు చేసి నమస్కరించారు. గౌరా కృష్ణ మాట్లాడుతూ ప్రజల్లో భక్తిభావన పెరిగితే సమాజం శాంతి సౌభాగ్యాలతో తులతూగుతుందన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు, మహిళలు గురుపూజలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమ నిర్వాహకుడు నందూరి గాంధీ మాట్లాడుతూ గురుపూజ మహోత్సవాలు ఈనెల 25 వరకూ కొనసాగుతాయన్నారు.

గురుపౌర్ణమి వేడుకలు

దెందులూరు: గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొవ్వలిలో సాయిబాబా ఆలయ నిర్వాహకులు వల్లపట్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త డాక్టర్ ఉషాబాలకృష్ణారావు స్వామివారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

హనుమాన్ చాలీసా పారాయణం

ఉంగుటూరు: గురు పౌర్ణమి సందర్భంగా కైకరం శ్రీ గీతామృత వాహిని సత్సంగం, సీతారామ గీతార్చన సత్సంగం సంయుక్త ఆధ్వర్యంలో గురుపౌర్ణమి నిర్వహించారు. వ్యాస మహర్షికి పూజ అనంతరం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. కోళ్ల భూసా భాస్కర రావు బృందం సంగీత సహకారం అందించారు.

బాదంపూడి దత్త క్షేత్రంలో వేడుకలు

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆదివారం పూర్ణహోమం నిర్వహించారు. ఆలయ నిర్మాత కలవచర్ల శ్రీనివాసరావు పర్యవేక్షణలో దత్తాత్రేయునికి అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. హోమం ప్రత్యేక యాగశాలలోనిర్వహించారు.

సాయిబాబా ఆలయాల్లో పూజలు

మండలంలో ఉన్న షిర్డి సాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు భజనలు కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. నారాయణపురం అక్కిన భాస్కరరావు నిర్మించిన సాయి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అన్న సమారాదన జరిపారు. అలాగే కైకరం, చేబ్రోలు, గొల్లగూడెం, ఉంగుటూరు, బాదంపూడి కాగుపాడు గ్రామాలలోఉన్న షిర్డి సాయి ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయా ఆలాయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు..

సాయిబాబాకు శాకాలంకరణ

భీమడోలు: గురుపౌర్ణమి పర్వదినం సందర్భంగా ఆదివారం భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, పాతూరులోని సాయిబాబాకు భక్తులు విశేష పూజలు చేశారు. గుండుగొలనులోని భారీ సాయిబాబా స్వామి ఆలయంలో శాకాలంకరణలో స్వామి వారిని అలంకరించారు. ఆలయాల్లో గణపతి పూజ, పంచామృత నవరస అభిషేకాలను వైభవంగా నిర్వహించారు. భీమడోలు సాయిబాబా ఆలయంలో తులసీ దళార్చన నిర్వహించారు. ఎంఎంపురంలోని సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ధర్మరాజు ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు పాల్గొన్నారు.